
సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 16 । జనవరి । 2025



చాంపియన్ 'తెలంగాణ'

నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌ను తెలంగాణ జట్లు సొంతం చేసుకున్నాయి.

వివరాలు 8లో ▸



మత సామరస్యానికి ప్రతీక

రంగాపూర్ నిరంజన్‌షావలి దర్గా ఉర్సు 17వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /14.9

చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

కత్తెర కాన్పులే..!

పాలమూరు జనరల్ ఆస్పత్రిలో తగ్గిన సాధారణ ప్రసవాలు

- గాడి తప్పుతున్న గైనిక్ విభాగం
- వైద్య సిబ్బంది దురుసు ప్రవర్తనపై విమర్శలు
- దృష్టి పెట్టని వైద్యారోగ్యశాఖ



పాలమూరు: జనరల్ ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పురుడు అంటేనే పునర్జన్మ లాంటిది. అలాంటిది కాన్పు.. కోతగా మారింది. శస్త్ర చికిత్సలతో చిన్నారులకు జన్మనిస్తున్న తల్లులు బిడ్డలను చూసుకొని తాత్కాలికంగా మురిసిపోతున్నారు. అనంతరం వారు వివిధ రకాల రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమేర మాత్రమే సాధారణ కాన్పులు చేస్తున్నారు. చాలా వరకు వైద్యులు సాధారణ ప్రసవం చేయడానికి సాహసించడం లేదు. గర్భిణులకు సాంకేతిక కారణాలు చెప్పి మాయచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న పాలమూరు జనరల్ ఆస్పత్రిలో 2023తో పోల్చితే 2024లో ప్రసవాల సంఖ్య చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. వైద్యుల సమయపాలన, సిబ్బంది వ్యవహారశైలి, వసతులు సక్రమంగా లేకపోవడం వల్ల గర్భిణులు రావడం తగ్గిపోయారనే విమర్శలు ఉన్నాయి. 2024లో 58,150 మంది గర్భిణులకు ఓపీ చూడగా.. 9,240 మంది ఆస్పత్రిలో చేరగా 8,154 మందికి కాన్పులు చేశారు. ఇందులో 4,895 మంది గర్భిణులకు ఆపరేషన్ చేయగా 3,259 మందికి సాధారణ కాన్పులు చేశారు. 2023లో 8,774 ప్రసవాలు అయితే 4,991 మంది గర్భిణులకు సిజేరియన్ ద్వారా కాన్పులు చేశారు. 2023తో పోల్చితే 2024లో 620 కాన్పులు తగ్గాయి. ఏడాది మొత్తంలో జరిగిన కాన్పుల లెక్కల ప్రకారం చూస్తే 70 శాతం ఆపరేషన్ ద్వారా కాన్పులు అవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా జనరల్ ఆస్పత్రి గైనిక్ విభాగం సరిగా పనిచేయడం లేదనే విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. గైనిక్ హెచ్‌ఓడీ అధికంగా సెలవులో ఉండటం, విభాగంపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. గతంలో గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ రాధ నిత్యం విభాగంలో ఉంటూ వైద్యులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వెళ్లడం వల్ల కొంత మెరుగైన ప్రదర్శన కన్పించింది. ప్రస్తుతం గైనిక్ విభాగంలో ఆ పరిస్థితి లేదు.

■ గైనిక్ విభాగంలో పని చేసే వైద్యులకు చాలా వరకు బయట క్లినిక్‌లు ఉండటం వల్ల కొంతమంది సరైన సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అక్కడ పని చేసే సిబ్బంది వ్యవహారశైలికూడా సరిగా ఉండడం లేదని ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ గర్భిణి ప్రసవం అయిన తర్వాత మృతి చెందడం కలకలం రేపింది. ఈ విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉందని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. నిత్యం చిన్నపాటి ఘటనలు ఆస్పత్రిలో జరగడం పరిపాటిగా మారింది. కొంతమంది దురుసు ప్రవర్తన వల్ల కూడా భయంతో గర్భిణులు ఆస్పత్రికి రావడం లేదు.

జనరల్ ఆస్పత్రిలో 2024లో చికిత్స చేయించుకున్న గర్భిణులు, ప్రసవాల వివరాలు

నెల	ఓపీ	ఐపీ	సాధారణ కాన్పులు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	5,487	814	283	418	701
ఫిబ్రవరి	5,444	783	281	383	664
మార్చి	5,259	870	298	380	678
ఏప్రిల్	5,091	728	319	421	740
మే	5,183	661	276	420	696
జూన్	4,793	792	257	421	678
జూలై	5,575	769	254	453	707
ఆగస్టు	4,340	889	314	443	757
సెప్టెంబర్	3,958	711	255	398	653
అక్టోబర్	4,161	835	253	409	662
నవంబర్	4,271	723	242	367	609
డిసెంబర్	4,588	665	227	382	609



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలు (ఫైల్)

ప్రసవ కోతలతో దీర్ఘకాలిక ఇబ్బందులు..

- కడుపు కోత కారణంగా శరీర సహజత్వాన్ని కోల్పోవాల్సి వస్తోంది.
- మునుపటిలా శరీరం అన్ని పరిస్థితులను తట్టుకునేందుకు సహకరించదు. కనీసం ఇంట్లో పనులు చేసుకోవడంతోనూ నొప్పులు వేధిస్తుంటాయి.
- హెర్నియా వంటి దీర్ఘకాల సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- రెండో కాన్పు తప్పకుండా సిజేరియన్ చేయాల్సి ఉంటుంది.
- సిజేరియన్ జరిగే సమయంలో గర్భాశయ పక్కన భాగాలపై గాయాలవడంతో పాటు ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తాయి.
- మత్తు మందుతో ఒక్కోసారి ప్రాణాంతక సమస్యలు తలెత్తే ప్రమాదముంటుంది.
- రక్తస్రావంతో అదనపు రక్తాన్ని అందించాల్సిన పరిస్థితులు వస్తాయి.
- రెండో కాన్పు సమయంలో తొమ్మిదో నెలలో గర్భసంచికి గతంలో వేసిన కుట్లు విడిపోయే ప్రమాదం ఉంది.
- గర్భసంచికి గాట్లు పెట్టి కుట్లు వేసిన ప్రాంతంలో మాయ అతక్కుపోయే అవకాశాలుంటాయి. తద్వారా భవిష్యత్‌లో అప్పుడప్పుడు తీవ్ర కడుపునొప్పి వచ్చే అవకాశాలుంటాయి.

కాన్పులపై ఆడిట్ నిర్వహిస్తాం..



జిల్లా జనరల్ ఆస్పత్రి జరిగిన కాన్పులపై త్వ రలో ఒక ఆడిట్ నిర్వహిస్తాం. ఆ లెక్క ల ద్వారా సిజేరియన్ ఎందుకు చేయాల్సి వచ్చిందనే అంశాలను సేకరిస్తాం. సాధారణంగా జనరల్ ఆస్పత్రికి బ్యాడ్, హైరిస్క్ కేసులు వస్తుంటాయి. ఈ క్రమంలోనే సెక్షన్స్ ఎక్కువ అవుతున్నట్లు గైనిక్ విభాగం వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీనిపై విచారణ చేస్తాం. ఒకవేళ సాధారణ ప్రసవం అయ్యే ప రిస్థితి ఉన్నా.. సిజేరియన్ చేసినట్లు బాధితు లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం.

– డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్‌ఓ

హైరిస్క్ కేసులతోనే..



ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ప్రసవం చేయలేని హైరిస్క్ కేసులను జనరల్ ఆస్పత్రికి ఎక్కువగా పంపిస్తున్నారు. దీంతో పాటు గర్భిణీలకు సంబంధించిన వ్యాధులు ఉన్న వారు కూడా వస్తున్నారు. గైనిక్ విభాగం వైద్యులతో సమీక్ష ఏర్పాటు చేసి సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల, కొత్తూర్ గ్రామాల్లో అసంపూర్తి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్ బాబును ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మద్దిగట్లలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇటీవల మద్దిగట్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి రూ.2.60 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తే వాటి బిల్లులు ఇప్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తమ్మన్న గౌడ్, వెంకటేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, వడ్డె శ్రీను, నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చిట్టెబోయిన్‌పల్లి పాఠశాల ప్రిన్సిపాల్ అనిత్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల ఒకటో తేదీ వరకు కులం, ఆదాయం, ఆధార్‌నంబర్, బర్త్ సర్టిఫికెట్, పాస్‌ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి'

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పనిపొందిన కుటుంబాల ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా రూ.12 వేలు ఇవ్వాలన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. ఎవరెవరికి ఎలా ఇస్తారనే దానిపై విధివిధానాలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, నాయకులు రఘు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై క్షేత్రస్థాయి పరిశీలన: ఆర్డీఓ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అమలు చేయనున్న వివిధ పథకాలపై పట్టణ పరిధిలోని 49 వార్డులలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని ఆర్డీఓ నవీన్ ఆదేశించారు. బుధవారం రాత్రి స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ పథకాలకు అర్హుల జాబితాను జాగ్రత్తగా రూపొందించాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంనాయక్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, ఆర్‌ఓ మహమ్మద్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చెన్నైలో ఆరు రోజుల పాటు కొనసాగే అఖిల భారత దక్షిణ ప్రాంత పోటీలకు పీయూ క్రికెట్ జట్టు (పురుషుల) బుధవారం బయలుదేరింది. అంతకుముందు క్రీడాకారులకు వైస్ చాన్స్‌లర్ జి.ఎన్.శ్రీనివాస్ ట్రాక్‌సూట్, క్రికెట్ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు తమిళనాడులోని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయంతో తిరిగి రావాలని, పాలమూరు యూనివర్సిటీకి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా.బషీర్‌అహ్మద్, సీనియర్ అధ్యాపకులు డా.అర్జున్‌కుమార్, పీడీలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్, కోచ్‌లు అబ్దుల్లా, అబిద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు అన్ని ఏర్పాట్లు

- కలెక్టర్ విజయేందిర



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపికకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నాలుగు పథకాలను ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డుసభలు నిర్వహించి అర్హుల జాబితాను తయారు చేయాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు వస్తే పది రోజులలోగా పరిష్కరించాలన్నారు. 21 నుంచి 25వ తేదీ వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని, గ్రామ, వార్డు సభలలో ఇందిరమ్మ కమిటీలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. రైతుభరోసాలో భాగంగా ఎకరాకు రూ.12 వేలు రెండు విడతలు (రూ.6 వేల చొప్పున)గా డీబీటీ పద్ధతిన ఇస్తామన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను 'రైతు భరోసా' నుంచి తొలగించాలన్నారు. ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ లే-అవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలకు, గోదాంలకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలతో ఉండి సాగుకు అనువుగా లేని భూములు, వ్యవసాయ యోగ్యం కాని భూములుగా గుర్తించాలన్నారు. రేషన్‌కార్డుల జారీకి కులగణన సర్వే ఆధారంగా తయారుచేసిన రేషన్‌కార్డు లేని కుటుంబాల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 'ఉపాధిహామీ'లో నమోదు చేసుకున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలే అర్హులుగా పరిగణించాలన్నారు. వారు 2023–24లో కనీసం 20 రోజులైనా పనిచేసి ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ద్వారా జాబితా రూపొందించామన్నారు. దీనిని రెండు రోజుల్లో మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించి ముందుగానే ఆయా గ్రామాలు, వార్డుల్లో టాంటాం చేయించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థలు, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావుతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఇతర శాఖల జిల్లా అధికారులు

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం

కొల్లాపూర్ రూరల్: సింగోటం శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేక మహోత్సవం, బ్రహ్మోత్సవ సంకల్పం, గణపతి పుణ్యావాహచన, ఋత్విక్‌వరణం, అఖండ స్థాపన, నవగ్రహ, అంకురారోహణ, ధ్వజరోహణ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను నగలు, పూలతో ముస్తాబు చేసి ఆలయ సమీపంలో ఉన్న మండలంలో ఆసీనులు చేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితులు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

20 వరకు ఉత్సవాలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక పూజలతో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 16న స్వామి వారికి ప్రభోత్సవం ఉండగా.. ప్రధాన ఘట్టం రథోత్సవాన్ని శుక్రవారం (17వ తేదీ)న నిర్వహిస్తారు. ఈ వేడుకను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 50వేల మంది భక్తులు హాజరవుతారు. 18న స్వామి వారికి తెప్పోత్సవం, 20 హంసవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



లక్ష్మీ నరసింహస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

రైతు భరోసాకు సన్నాహాలు

- యాసంగికి పెట్టుబడి సాయం
- గ్రామసభల్లో సాగుభూముల వివరాలు
- నేటి నుంచి క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): 'రైతు భరోసా'తో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించేందుకు సన్నాహాలు చేస్తుంది. ఎకరానికి రూ.12వేల చొప్పున రెండు విడతలుగా పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించింది. భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పింది. ఈసారి సాగు యోగ్యమైన భూములకు మాత్రమే సాయం అందించడానికి అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టనున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం ప్రతీ రైతుకు రైతు భరోసా విడుదల చేస్తామని ఈనెల 26న ప్రభుత్వం ప్రకటించింది. ఏడాదికి రూ. 12 వేల చొప్పున అందించనున్నారు. పథకం పక్కదారి పట్టకుండా వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటివరకు గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందించింది. జిల్లాలో గత వానాకాలం సీజన్‌లో రూ.220.13 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది.

రైతుల ఆశలన్నీ 'రైతు భరోసా'పైనే

జిల్లాలో రైతు భరోసాపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. సంక్రాంతి నుంచి ఈ సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 26 నుంచి అర్హులైన రైతులకు ప్రతి ఏడాది ఎకరానికి రూ.12వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ మొదలుపెట్టనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. వానాకాలం, యాసంగి సీజన్లలో రూ.6వేల చొప్పున నగదు అందించనుంది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధి విధానాల ప్రకారం ఎందరికి భరోసా దక్కుతుందో ఈనెల 26వ తేదీన తేలనుంది. గతంలో రైతుబంధు పేరిట వ్యవసాయేతర భూములకు సైతం రైతుబంధు అందింది. ఇప్పుడు మాత్రం సాగులో ఉన్న, సాగుకు యోగ్యమైన భూములకు భరోసా ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. భూ భారతి పోర్టల్‌లో నమోదై ఉన్న సాగు భూములకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 3.50లక్షల ఎకరాల్లో సాగు భూములున్నాయి. ఇందులో 2,19,237మంది రైతులు రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని పొందుతూ వచ్చారు.

గ్రామ నక్షా, గూగుల్ మ్యాప్‌తో సర్వే

గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సాగు యోగ్యం కాని భూములను పక్కాగా గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. తహసీల్దార్, ఏఓ, ఏఈఓ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన బృందాలు గ్రామ నక్షా, గూగుల్ మ్యాప్‌తో భూభారతి భూముల వివరాలతో సర్వేలో పాల్గొంటారు. అనంతరం సర్వేలో అర్హులుగా గుర్తించిన రైతుల జాబితాను 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో ప్రదర్శిస్తారు. సాగుకు పనికిరాని భూముల వివరాలను పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. సర్వే పక్కాగా నిర్వహిస్తే లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే



ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహిస్తాం. అర్హుల వివరాలు గ్రామసభల్లో వెల్లడిస్తాం. వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో పాటు మరో ఒకటి, రెండు శాఖల సంయుక్త కార్యాచరణ తర్వాతనే గ్రామసభల్లో రైతు భరోసా లబ్ధిదారులు, సాగు భూముల వివరాలు వెల్లడి కానున్నాయి. అభ్యంతరాలు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. తహసీల్దార్, ఏఓ మండల స్థాయి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

భూమి లేని వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ద్వారా రూ.12వేల సాయాన్ని రెండు విడతలుగా అందించనుంది. 'ఉపాధి హామీ' జాబ్ కార్డు కలిగిన కుటుంబాలకు వర్తింపజేస్తుంది. ఏడాదిలో కనీసం 20 రోజుల పాటు ఉపాధి పనిచేసిన కూలీలకు ఈ పథకం అందిస్తారు. జిల్లావ్యాప్తంగా 1,39,215 కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. ఇందులో 20 రోజులకు పైబడి పనిచేసిన కుటుంబాలు 51,025 ఉన్నట్లు జిల్లా గ్రామీణ ఉపాధి హామీ అధికారుల ద్వారా తెలిసింది. గ్రామసభల్లో అర్హులను గుర్తిస్తారు.

జిల్లాలో భూ విస్తీర్ణం	6 లక్షల ఎకరాలు
అటవీ భూములు	2 లక్షల ఎకరాలు
సాగు యోగ్యమైనవి	3.50 లక్షల ఎకరాలు
వానాకాలంలో సాగయ్యేవి	3.42 లక్షల ఎకరాలు
యాసంగి సీజన్‌లో	1.70 లక్షల ఎకరాలు

2న మేధావుల సంఘీభావ సభ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణ అమలుపై వచ్చే నెల 2న స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో మాదిగ, మాదిగేతర మేధావులతో సంఘీభావ సభ ఉంటుందని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు వెంకటస్వామి అన్నారు. మంగళవారం టీఎన్‌జీఓ భవన్‌లో మాదిగ ఉద్యోగుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజు అందరితో సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు తగువుల ప్రభాకర్, గాలి యాదయ్య, ఎం.వెంకటేశ్, కావలి కృష్ణయ్య, ఆకేపోగు రాములు, బాలపీర్, బోరెల్లి కొండయ్య, బోయపల్లి ఆంజనేయులు, అనుముల యాదయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోతిరెడ్డిపల్లిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన మెంట బాలస్వామి(35) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. పోతిరెడ్డిపల్లికి చెందిన మెంట బాలస్వామి కుటుంబం గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎనిమిది రోజుల క్రితం గొర్రెలు అమ్మే విషయమై భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. మంగళవారం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కట్టపై విగతజీవిగా పడిఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. గొడవ పడి ఇంటి నుంచి వెళ్లాడని, చుట్టాల ఇండ్లలో ఉన్నాడేమోనని అనుకున్నట్లు భార్య ఎస్ఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాలస్వామి మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఉండడంతో డాక్టర్ వచ్చి అక్కడే పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో మహిళ..



చంద్రమ్మ(ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని వల్లభాపురం గ్రామంలో చంద్రమ్మ(50) అనే మహిళ పాముకాటుకు గురై సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వల్లభాపురంలో సోమవారం ఇంటిముందు అరుగుపై నిద్రిస్తున్న చంద్రమ్మను నాగుపాము కాటేసింది. కుటుంబ సభ్యులు గుర్తించి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లినా మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారం రోజుల క్రితం ఇదే గ్రామంలో కృష్ణమ్మ అనే మహిళ కూడా పాముకాటుకు గురై మరణించింది.

రైలు ఢీకొని వ్యక్తి..

ఆత్మకూర్: రైలుపట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన వె లుగుచూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలి పిన వివరాలు.. ఆత్మకూర్ మండలంలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్, గద్వాల మధ్య రైలు పట్టాలపై 13వ తేదీ అర్ధరాత్రి ఓ వ్యక్తి(35) శవం పడి ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు. 14వ తేదీన సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతూ..

మిడ్జిల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన తిమ్మాజిపేట మండలంలో బుధవారం చో టుచేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు వివరాల ప్రకారం.. తిమ్మాజిపేట మండలంలోని చే గుంటకి చెందిన గడ్డం చెన్నయ్య (48) మిడ్జిల్ మండలంలోని దోనూర్‌కి చెందిన శ్రీనివాస్‌గౌడ్ దగ్గర కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే ఉంటూ వ్యవసాయ పనులు చేన్నాడు. అప్పుల బాధ భరించలేక ఈనెల 11న గడ్డిమందు తాగాడు. దీన్ని గమనించిన భార్య సంతోష చుట్టుపక్కల వారితో సహకారంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించింది. చికిత్సపొందుతూ 14న రాత్రి చెన్నయ్య మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం



రామగళ్ల కవిత (ఫైల్)

కోయిల్‌కొండ: వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని సూరారంలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామగళ్ల కవిత (25)ను భర్త రామగళ్ల కృష్ణయ్య, అత్త అనంతమ్మ వరకట్నం తీసుకురావాలంటూ నిత్యం వేధించే వారని, దీంతో కవిత మంగళవారం మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





బాలికల, బాలుర విభాగం విజేత తెలంగాణ జట్లకు ట్రోఫీ అందజేస్తున్న చైర్మన్లు కొత్వాల్, ఆనంద్‌గౌడ్, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ.వెంకటేశ్

చాంపియన్లు.. తెలంగాణ జట్లు

నేషనల్ హ్యాండ్‌బాల్ బాల, బాలికల విభాగాల్లో తెలంగాణకే టైటిళ్లు

- రన్నరప్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్లు
- మూడో స్థానంలో యూపీ, హర్యానా
- విజేతలకు ట్రోఫీలు అందజేసిన చైర్మన్లు కొత్వాల్, ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన అండర్–17 స్కూల్ గేమ్స్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్లుగా తెలంగాణ జట్లు నిలిచాయి. బాలుర, బాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు అద్వితీయమైన ప్రతిభ కనబరిచి టైటిళ్లు గెలుచుకున్నాయి. బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు, బాలికల విభాగంలో రాజస్థాన్ జట్టు, మూడోస్థానంలో బాలురలో ఉత్తరప్రదేశ్ జట్టు, బాలికల్లో హర్యానా జట్లు నిలిచాయి. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 10 నుంచి ప్రారంభమైన నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ మంగళవారం ముగిసింది.

ఫైనల్‌లో ఏపీపై తెలంగాణదే విజయం

స్టేడియంలో బాలుర విభాగంలో తెలంగాణ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాష్ట్ర క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. తొలి అర్ధభాగంలో 10–4 గోల్స్‌తో ఆధిక్యంతో ఉన్న తెలంగాణ రెండో అర్ధభాగంలో కూడా అదేరీతిలో ప్రదర్శనను కొనసాగించింది. మ్యాచ్ ముగిసే సమయానికి చివరకు తెలంగాణ జట్టు 18–7 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.



ఫైనల్‌లో తలపడుతున్న తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు

బాలికల విభాగంలో తెలంగాణ విన్నర్..

బాలికల విభాగం ఫైనల్‌లో తెలంగాణ జట్టు–రాజస్తాన్ జట్టు హోరాహోరీగా తలపడ్డాయి. నువ్వా నేనే రీతిలో సాగిన మ్యాచ్‌లో చివరగా తెలంగాణ జట్టు 12–9 గోల్స్ తేడాతో రాజస్తాన్ జట్టుపై విజయం సాధించి టోర్నీలో విన్నర్‌గా నిలిచింది.

స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఉజ్వల భవిష్యత్

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, త్వరలో ఏర్పాటు కానున్న స్పోర్ట్స్ యూనివర్సిటీతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్వాల్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ హబ్‌గా మారుతున్నట్లు తెలిపారు. టోర్నీ విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. నేషనల్ హ్యాండ్‌బాల్ గెలుపొందిన తెలంగాణ బాల, బాలికల జట్లకు, ఓడిన జట్లకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, పాల్గొనడమే గొప్ప అని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ అన్నారు. నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో దేశంలోని రాష్ట్రాల జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పి.రజనికాంత్‌రెడ్డి, ఎండి.జియావుద్దీన్, ఎస్‌జీఎఫ్ఐ ఫీల్డ్ ఆఫీసర్ దేవేందర్‌నాథ్‌గోస్వామి, పీడీలు వేణుగోపాల్, బాల్‌రాజు,నాగరాజు, రాఘవేందర్, అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు షేక్ ఉమర్, జాజిమొగ్గ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక


నిరంజన్‌షావలి దర్గా

- 17న గంధోత్సవం
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లుచేసిన అధికారులు

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్‌లో నిరంజన్‌షావలి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన జాతరల్లో రంగాపూర్ ఒకటి. ఈఉర్సు నల్లమల ప్రజలకు ప్రత్యేక సంబరం. ఈనెల 17వ తేదీ శుక్రవారం రాత్రి నుంచి వారం రోజులపాటు వైభవంగా ఉర్సును నిర్వహిస్తారు. హిందూ, ముస్లింలు అనే తేడాలేకుండా ఉర్సుకు జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాలో మొక్కులు చెల్లించుకుంటారు. దర్గాను సందర్శించి మొక్కుబడి చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడి ఉన్న వారు కందూరు చేసి మేకలు, గొర్రెలను బలి ఇస్తుంటారు. ఉర్సు రంగాపూర్‌గా పిలవబడుతున్న ఈదర్గా వద్ద భక్తులు ఉత్సవాల సమయంలోనే కాక వివిధరోజుల్లో దర్గా దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అమ్రాబాద్ మండలం ప్రజలు ఏశుభకార్యక్రమం చేసిన మొదట కొండపై ఉన్న దర్గాను దర్శించుకొని తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

వారం రోజుల పాటు నిర్వహణ

రంగాపూర్ ఉర్సును దర్గతండా, రంగాపూర్ పంచాయతీలు, దర్గా కమిటీ ఆధ్వర్యంలోవారం రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 17న రాత్రి గంధోత్సవం ఉంటుంది. గంధం మొదటి రోజు ఖవాలీ, జియారత్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అచ్చంపేట పట్టణంలోని నారాయణ ప్రసాద్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈనెల 17న శుక్రవారం రాత్రి అచ్చంపేట మహబుబ్‌స్వామి దర్గాతో పాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, బొమ్మనపల్లి, పెనిమిళ్ల, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి,కొల్లాపూర్, వనపర్తి, మహబుబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకవస్తారు. బొమ్మనపల్లి నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణ. గ్రామాల నుంచి బయలు దేరిన గంధోత్సవాలు అర్ధరాత్రి వరకు రంగాపూర్‌కు చేరుకుంటాయి. అన్ని ప్రాంతాల నుంచి గంధోత్సవాలు చేరుకోగానే భక్తులు రెట్టించిన ఉత్సాహంతో నత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొంటారు. 18న తెల్లవారుజామున ఉర్సు ప్రారంభమై వారం రోజులు పాటు జాతర కొనసాగుతుంది.



రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా

ఉమామహేశ్వర క్షేత్ర సందర్శన...

రంగాపూర్ గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలసిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రాన్ని కూడా దర్గా దర్శనంతరం భక్తులు సందర్శించడం ఆనవాయితీ. రంగాపూర్ ఉర్సుకు రెండు రోజుల ముందే శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రంగాపూర్ ఉర్సుకు వచ్చిన భక్తులు కుల, మత బేధాల్లేకుండా విధిగా ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మత సామరస్యానికి దర్పణం పట్టే ఈరెండు ఉత్సవాలు ఒకే సారి ముగుస్తాయి.

ప్రత్యేక బస్సులు

రంగాపూర్ ఉర్సు, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. నాగర్‌కర్నూలు–అచ్చంపేట–రంగాపూర్, రంగాపూర్–ఉమామహేశ్వరం కొండపైకి 12 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం ప్రసాద్ తెలిపారు. ఉమామహేశ్వరం కొండపైకి ప్రైవేట్ వాహనాలు అనుమంతిచరు. కింది కొండ భోగమహేశ్వరం వద్ద నిలిపివేస్తారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి ఉంటుంది.


ముగిసిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కోడేరు: జిల్లాలో 1,400 అడుగుల ఎత్తైన ఎత్తం గట్టుపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు వైభవంగా కొనసాగాయి. అర్చకుడు మురళీధర్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి బండరాళ్లపై పాకుతూ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తమ పిల్లల తలనీలాలు సమర్పించారు. గట్టుపైకి వెళ్లలేని వారు కోడేరు వైపున ఉన్న ముఖద్వారం వద్ద దర్శించుకున్నారు. కొండ్రావుపల్లి, ఎత్తం తదితర గ్రామాల ప్రజలు భక్తులకు అన్నదానం చేశారు.



పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి



కొండపైకి ఎక్కుతున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



చంద్రయ్య (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో నివాసముండే చంద్రయ్య (67) తన సొంత పనుల నిమిత్తం కూరగాయల మార్కెట్ నుంచి ఇంటికి వచ్చేందుకు హైదరాబాద్ చౌరస్తాకు చేరుకున్నాడు. హైదరాబాద్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా దేవరకొండ వైపు నుంచి టమాటల లోడ్‌తో వెళ్తున్న మినీ డీసీఎం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రయ్య కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు

అమాయకులే టార్గెట్

ఏటీఎం కార్డులతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా

- ముగ్గురు దుండగులకు రిమాండ్
- రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు స్వాధీనం

షాద్‌నగర్ రూరల్: అమాయకులు, మహిళలను టార్గెట్‌గా చేస్తారు.. ఏటీఎంలలో డబ్బులు తీయడం రాని వారిని పరిచయం చేసుకుంటారు.. డబ్బులు తీసిస్తామని దృష్టిమరల్చి ఏటీఎం కార్డు మార్చేసి డూప్లికేట్ కార్డు ఇస్తారు. ఒరిజినల్ కార్డుతో డబ్బులు డ్రా చేసుకుంటారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ముగ్గురు సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. బిహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్, సోనబర్సా గ్రామానికి చెందిన కరిమన్‌సహాని, రూప్‌దేవ్‌సహాని, పంజాబ్ రాష్ట్రం కపుర్తల పగ్వారాకి చెందిన సహీబ్‌సహాని కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వచ్చారు. కూలీ పనులు చేస్తూ శంషాబాద్ మండలం తొండుపల్లిలో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే పథకం వేసి ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్నారు.

జడ్చర్ల కేసుతో ఆటకట్టు..

నందిగామ మండలం, శ్రీనివాసులగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి రాజు 2024 ఆగస్టు 5న జడ్చర్ల రోడ్డులోని ఐడీబీఎం ఏటీఎంకు వెళ్లాడు. ఈయనకు డబ్బులు తీయడం రాదని గ్రహించిన దుండగులు, అతని వద్దకు వెళ్లి కార్డు మార్చేశారు. కొంతసేపటి తర్వాత తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన రాజు అదేరోజు షాద్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో ముఠా సభ్యులను పట్టుకున్నారు. పోలీసుల విచారణలో షాద్‌నగర్, ఆర్‌జీఐఏ, పటాన్‌చెరు, శంషాబాద్‌లో రెండేసి చొప్పున, దుండిగల్, సనత్‌నగర్, జడ్చర్ల, గచ్చిబౌలి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, బాలానగర్ ఏటీఎంల వద్ద ఒక్కోటి చొప్పున మొత్తం 15 దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కేరళ రాష్ట్రం కొచ్చిలో ఈనెల 13 నుంచి ప్రారంభమైన వుమెన్స్ నేషనల్ నగేశ్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ (బ్లైండ్)లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారిణులు తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటున్నారు. వీరిలో కల్వకుర్తి నియోజకవర్గం ఊర్కొండపేటకు చెందిన అనిత రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా అంకిత (మహమ్మదాబాద్), ప్రీతి, మహేశ్వరి (ఏనుగొండ), సంగీత (కొండాపూర్), అనూష (నారాయణపేట) నేషనల్ టోర్నీలో ఆడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అంకిత 65 బంతుల్లో 96 పరుగులు చేసి ప్రతిభచాటింది.



ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేపట్టి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని తూర్పు దౌదర్‌పల్లి కాలనీ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు.. ఆకస్మిక దాడులు చేపట్టారు. పేకాట ఆడుతున్న తూర్పు దౌదర్‌పల్లి కాలనీకి చెందిన ముళ్ల మహబూబ్, తెలుగు మహేష్, చంద్రరాములు, వెంకట్రాములు, శ్రీను, రాఘవేంద్ర, అంజి, నర్సింహులు, కుర్వ భోజన్నలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు, రూ. 59,390 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

- ఆటోను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- కల్వకుర్తి మండలం తోటపల్లిలో విషాదం



బంగారయ్య (ఫైల్)



మహేష్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: అతివేగం ఇద్దరి ప్రాణాలు తీసింది. బ్యాంకు పని నిమిత్తం వెళ్లి వస్తున్న వారి ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తోటపల్లికి చెందిన నాగమ్మ బ్యాంకు పని నిమిత్తం తన కుమారుడు జోగు మహేష్ (35)తో కలిసి ఆటోలో వెళ్లింది. అక్కడ పనులు ముగిశాక సాయంత్రం అదే ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. వీరి వెంట అదే గ్రామానికి చెందిన చెందిన జోగు బంగారయ్య (39), శ్రీపతి కల్వకుర్తి నుంచి బయల్దేరారు. అయితే తర్నికల్ గ్రామ సబ్‌స్టేషన్ దాటిన తర్వాత ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో నడుపుతున్న మహేష్‌తో పాటు బంగారయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. నాగమ్మ, శ్రీపతికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. శ్రీపతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు బంగారయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కళ్లెదుటే కుమారుడు ప్రాణం వదలడంతో తల్లి నాగమ్మ తీవ్ర వేదనకు గురైంది. ఇద్దరి మృతితో తోటపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కొంగలతో కొంగొత్త అందం..

జడ్చర్ల మండలం మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయం వద్ద దుందుభి నదిలో మోడువారిన చెట్లపై కొంగలు వాలి కొత్త అందాలు తీసుకొచ్చాయి. సూర్యాస్తమయ సమయంలో వందల సంఖ్యలో కొంగలు.. ఎండిన కొమ్మలపై వాలి మల్లెపూల వనంలా కనిపించాయి. ఆలయానికి వెళ్లిన సందర్శకులకు ఈ దృశ్యం కనువిందు చేసింది. – జడ్చర్ల టౌన్

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..



పాండు(ఫైల్)

దామరగిద్ద: పండగ పూట ఆనందంగా గడపాల్సిన ఆ ఇంట విషాదం నెలకొంది. చేపలతో ఇంటికి తిరిగి వస్తాడనుకున్న వ్యక్తి మృతదేహమై తేలిన సంఘటన బుధవారం చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెంది కడ్తాల పాండు(38) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. రెండు రోజుల క్రితం పండగకు గ్రామానికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం స్థానిక ఊర చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. ప్రమాద వశాత్తు చెరువులో మునిగిపోయాడు. చీకటి పడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చెరువు గట్టుపై కుటుంబసభ్యులు పరిశీలించారు. కట్టు బట్టలు అక్కడే ఉండడంతో పోలీసులకు సమాచారమందించారు. మరుసటి రోజు చెరువులో పోలీసులు సమక్షంలో చెరువులో గాలించగా పాండు మృతదేహం బయట పడింది. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతనికి భార్యలక్ష్మి, కుమారుడు రమేష్ ఉన్నారు.

గంగారంలో..

బిజినేపల్లి: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన దుదేకుల మాబు(71) చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి వెలుగుచూసింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన మాబు ఈ నెల 12న స్థానిక రంగయ్య కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదశావత్తు కుంటలో పడి మరణించాడు. అటుగావెళ్లిన కొందరు స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. వృద్ధుడు మాబును సోమవారం ఒడ్డుకు చేర్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.